రాజు ప్రజలను పాలించడానికి దైవంచే నియమించబడ్డాడు. ఏవైనా కష్టాలు, తప్పులు వుంటే దానికి రాజు ననాల్సిన పనిలేదు. ప్రజలు చేసే పాపానికి శిక్షగా దేవుడే యివి ప్రసాదిస్తాడు. కాబట్టి అనుభవించాల్సిందే! ఎప్పుడయ్యా యీ కష్టాలు పోతాయంటే, ప్రజలెప్పుడు పరిశుద్ధులయితే అప్పుడు. ప్రజలు తమ దోషాలు తొలగించుకుందుకు దేవుణ్ని ప్రార్థించాలి. ఇదొక్కటే శరణ్యం' అని ఓ చిరునవ్వు నామీద కోలగా విసిరాడు.

నాకూ నవ్వొచ్చింది. 'ఒరే చందూ! నువ్వు చెప్పిన సిద్ధాంతానికి తిరుగులేదురా. మహామంచి మాట చెప్పావు. నిజమే. ప్రజల అసమర్థతే ప్రస్తుత పరిస్థితులకి కారణం. ప్రజల ఆలోచనా శక్తి క్షీణతే ప్రస్తుతపు నిలువుదోపిడికి మూలం. వారి నిద్రమత్తే సర్వవ్యాప్తమైన లంచగొండితనానికి ఆసరా. ప్రజలే కళ్లు తెరిచి జ్ఞానవంతులుగా వుంటే యీ గమ్మత్తులు జరగనే జరగవు. ప్రజలు చైతన్యవంతులైతే ప్రభుత్వం వారి కనుగుణ్యమయ్యేదే వుంటుంది. నిజమే—యథా ప్రజా, తథా రాజా!' అని ముగించాను, యీ విపరీత వాదాన్ని.

'అహ్హాహా!' అని భళ్ళున నవ్వి, శాస్త్రిలు 'అక్కడే వుందండీ కీలకం! కిటుకు!' అని పంచ సర్దుకుని లేచేసరికి, మేంకూడా యింటి ముఖం పట్టాం.

## ముందు జాగ్రత్త

"హితశ్రీ"

ఆ రోజు ఉదయం లేచీ లేవడంతో నాగరాజు దర్శనం కావడం దేశరాజుకి గుండెల్లో రాయి పడ్డట్టయింది. అప్రయత్నంగా దేశరాజు కంఠంనుండి వెలువడ్డ గావుకేక విని నాగరాజు తలయెత్తి అతడివైపు చూసి శిరఃకంపనం చేసి చరచరా జారుకున్నాడు. దేశరాజుకి పైప్రాణం పైనే పోయింది. నాగరాజు సంగతి అందరికీ తెలిసిందే. పగ పట్టాడంటే అటోయిటో తేల్చుకునే రకం. తను నాగరాజుకి ఇంతవరకు ఏమీ ఉపకారంచేసి ఎరగడు; చేయాలనిలేదు కూడా. తనమనస్సువిప్పి అతడితో చెప్పగలిగితేఎంతబాగుండును—'ఓ నాగయ్యా, నువ్వంటే నాకు ఎంతమాత్రం ద్వేషంలేదు. నలుగుర్నీ పోగుచేసి నిన్ను తన్నించాలనే ఉద్దేశం నాకు ఏకోశానా లేదు. నాజోలికి నువ్వు రాకుండా ఉంటే నాకదే పదివేలు.' అని అతడు నమ్మగలిగేలా చెప్పడం ఎలా? చెపితే అర్థంచేసుకునే మనిషి గనకనా! దేశరాజుకి ఏమీ తోచలేదు. ఆలోచించి ఎందుకైనా మంచిదని ఆ సాయంత్రం ఓ దుడ్డుకర్ర సంపాదించి పడకగదిలో మంచానికి చేరువగా పెట్టుకున్నాడు.

నిజం చెప్పాలంటే నాగరాజుకి కూడా దేశరాజుకి అనవసరంగా అపకారం చేయాలనే దుర్బుద్ధిలేదు. కాని దేశరాజు ఉనికి తనకి ప్రమాదకరంగా పరిణమించగలదనే సందేహం అతడిని పట్టుకుంది. బలవంతుడు; నలుగురు మనుష్యుల అండగలవాడు. ముందుముందు తన వల్ల ఏదైనా అపకారం జరగవచ్చునేమోనని తను పరాకుగాఉన్న ఏ సమయంలోనో తన పని పట్టించడానికి ప్రయత్నం చేయడని ఎలా నమ్మడం? దేశరాజుని ఎందుకైనా ఒకకంట కనిపెట్టి ఉండడం మంచి దనుకున్నాడు నాగరాజు. చీకటి పడడంతో దేశరాజు ఇంటి చుట్టూ ప్రదక్షిణంచేసి పడకగది కిటికీలోనుంచి తొంగిచూశాడు నాగరాజు. దుడ్డుకర్రమీద ఒకచేయి ఉంచి నిద్రపోతున్నాడు దేశరాజు. నాగరాజు బుసకొట్టాడు.

కలతనిద్ర పోతూన్న దేశరాజు బుస విని హఠాత్తుగా లేచి చుట్టూ చూశాడు. నల్లగా చీకట్లో జారుకుంటున్న నాగరాజుని చూసి గుండె పట్టుకున్నాడు దేశరాజు. నాగరాజు తనని చంపటానికి నిశ్చయించుకున్నాడు, ఏమీ సందేహంలేదు. మర్నాడు—

మధురమైన సంగీతం విని తన ఇంటిలోంచి బయటికి వచ్చాడు నాగరాజు. దేశరాజు!...

దేశరాజు నురగలు కక్కాడు. నాగరాజు వెల్లకిలబడ్డాడు. కాకులకీ, గద్దలకీ పండుగ; పని లేని జనానికి ఉబుసుపోక.